DD9 వార్త
తెలుగు దినపత్రిక
శనివారం, సెప్టెంబర్ 01 2025

## అన్నదాతను ఆగం చేసిన మోంథా తుఫాన్!

- రైతులను పరామర్శించిన బిజెపి రామగుండం ఇన్‌ఛార్జ్ కందుల సంధ్యారాణి
- ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలంటూ కలెక్టర్‌కి వినతి పత్రం



8 లో

# బొమ్మలమ్మ గుట్టను రక్షించుకుందాం..

## గ్రానైట్ మాఫియా కి వ్యతిరేకంగా పోరాడదాం

- ఈ పోరాటం లో జాగృతి ముందువరుసలో నిలుస్తుంది
- మొంథా తుపాను కారణంగా రైతులు తీవ్ర నష్టంలో ఉన్నారంటూ ఆవేదన
- వర్షా ల వల్ల ధాన్యం తడిసి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది
- ఎకరాకు రూ.10 వేలు పరిహారం సరిపోదు రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్
- బూజు పట్టిన, మొలకెత్తిన ధాన్యం కూడా ప్రభుత్వం కొనాలి
- ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించాలి
- బీసీ హాస్టల్‌లో శ్రీవర్షిత అనుమానాస్పద మరణంపై అనుమానాలు
- ఏడాదిన్నరలో 110 మంది పిల్లలు చనిపోతే, ప్రభుత్వం పట్టించుకోకపోవటం దారుణం
- ఇది సాధారణ మరణం కాదు,సిట్ వేయాలి
- కరీంనగర్ జాగృతి జనంబాటలో కల్వకుంట్ల కవిత
- కవితకు ఘన స్వాగతం పలికిన జాగృతి శ్రేణులు




హైదరాబాద్, అక్టోబర్ 31(డిడి9 వార్త): ప్రాచీన చారిత్రక వారసత్వ సంపద అయిన బొమ్మలమ్మ గుట్టను గ్రానైట్ మాఫియా బారి నుంచి రక్షించుకోవాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. జాగృతి “జనంబాట” కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బొమ్మలమ్మగుట్టను సందర్శించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ “చారిత్రక గుట్టపై గ్రానైట్ మాఫియా కన్ను వేసింది. తమ సొంత ఖజానాలను నింపుకోవడానికి ఈ గుట్టను విధ్వంసం చేయాలనుకుంటున్నారు. భవిష్యత్ తరాల కోసం బొమ్మలమ్మగుట్టను రక్షించుకోవడం మనందరి బాధ్యత” అని స్పష్టం చేశారు. బొమ్మలమ్మగుట్ట రక్షణ కోసం జరిగే ఉద్యమంలో తెలంగాణ జాగృతి ముందువరుసలో ఉంటుందన్నారు.

2 లో




## దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి



9 లో

- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- సమైక్యతా భావం పట్ల అవగాహన కల్పించడమే లక్ష్యం

## మెగా (విజయం)రక్తదాన శిబిరం

- మెగా రక్తదాన శిబిరం కు ' విశేష స్పందన '
- పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా మెగా రక్తదాన శిబిరం

7 లో



## సర్దార్ వల్లభభాయ్ పటేల్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి..

- గిరిజన యువతకు ఫర్నిచర్ తయారీ రంగంలో వృత్తి శిక్షణతో ఉపాధి అవకాశాలు...
- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్...

5 లో













# బొమ్మలమ్మ గుట్టను రక్షించుకుందాం..

## గ్రానైట్ మాఫియా కి వ్యతిరేకంగా పోరాడదాం

కరీంనగర్‌లో కవితకు జాగృతి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. బతుకమ్మలు, బోనాలు, ఒగ్గుడోలు, డప్పువాయిద్యాలతో నాయకులు, కార్యకర్తలు ఆమెకు స్వాగతం పలికారు.ఆ తర్వాత అల్గునూరు చౌరస్తాలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆమె, అనంతరం భారీ ర్యాలీగా తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అంజలి ఘటించారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి కూడా పూలమాల వేసి నివాళులు అర్పించారు.

**రైతుల ధాన్య సమస్యపై మండిపడ్డ కవిత**

కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని కల్వల ప్రాజెక్టు, మక్తపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు అనంతరం కవిత  మాట్లాడుతూ మొంథా తుపాను కారణంగా రైతులు తీవ్రమైన నష్టాన్ని చవిచూశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలల తరబడి కొనుగోళ్లు జరగడం లేదు. వర్షాల కారణంగా రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. మానవతా దృక్పథంతో ప్రభుత్వం వారిని ఆదుకోవాలి" అని అన్నారు. ఎకరాకు రూ.10 వేలు పరిహారం సరిపోదు. కనీసం రూ.50 వేలు ఇవ్వాలి. మొలకెత్తిన, బూజు పట్టిన, తేమ శాతం ఎక్కువ ఉన్న సరే ధాన్యం కూడా ప్రభుత్వం కొనాలి. మిల్లర్లు పెట్టిన కండిషన్లు రైతులకు భారంగా మారాయి. కౌలు రైతుల ధాన్యం కూడా కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలి" అని కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కలెక్టర్, అధికారులు ఇప్పటివరకు ఫీల్డ్‌లోకి రాలేదు. పంట నష్టం అంచనా వేయలేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు న్యాయం చేయాలి" అని అన్నారు.

**శ్రీవర్షిత మరణంపై ఆవేదన వ్యక్తం చేసిన కవిత**

బీసీ రెసిడెన్షియల్ హాస్టల్‌లో అనుమానాస్పదంగా చనిపోయిన శ్రీవర్షిత కుటుంబ సభ్యులను కలిసిన కవిత తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వేల్పేర్ హాస్టల్స్‌లో ఏడాదిన్నరలో 110 మంది పిల్లలు చనిపోయారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. ఇంత మానవతా దృక్పథం లేకుండా ఎలా వ్యవహరిస్తారు?" అని ఆమె ప్రశ్నించారు.శ్రీవర్షిత చనిపోవటానికి గంట ముందు తల్లిదండ్రులతో మాట్లాడింది. గంటన్నరలోనే ఇన్సిడెంట్ జరిగింది. టీచర్లు, పోలీసులు కనీసం వివరాలు చెప్పలేదు. ఇది సాధారణ మరణం కాదు, ఇందులో కుట్ర ఉంది. ప్రభుత్వం స్పెషల్ ఎంక్వైరీ, సిట్ వేయాలి" అని కవిత డిమాండ్ చేశారు.పిల్లల మరణాలకు కారణాలు తెలుసుకొని వాటిని ఆపాలి. పేద పిల్లల ప్రాణాలకు విలువ ఇవ్వని ఈ ప్రభుత్వానికి ఆ పిల్లల ఉసురు తగులుతుంది. పేద పిల్లల మరణాలపై జీరో టాలరెన్స్‌తో వ్యవహరించాలి" అని కవిత గారు స్పష్టం చేశారు. శ్రీవర్షిత చదువుల్లో ఫస్ట్, స్కూల్ లీడర్‌గా ఉన్న తెలివైన అమ్మాయి అని గుర్తు చేశారు.ఇలాంటి అమ్మాయి చనిపోతే తల్లిదండ్రులకు ఎంత బాధ ఉంటుందో ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. ఇది రాజకీయాల విషయం కాదు, మానవతా అంశం" అని అన్నారు.జాగృతి తరపున శ్రీవర్షిత కుటుంబానికి అండగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు.



# ఇచ్చిన హామీల ఊసే లేదు..



**చర్ల, అక్టోబర్ 31 (డిడి 9 వార్త)**

చర్ల లోని బిఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయంలో మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, అయినవోలు పవన్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశానికి

ముఖ్య అతిథులుగా హాజరైన భద్రాచలం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ లు మాట్లాడుతూ... రాష్ట్రంలో మొంథా తుపాన్ ప్రభావం కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకుఎకరానికి 50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనపై తెలంగాణ ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలు నెరవేర్చ లేదని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 23 నెలలు కావస్తుంది కానీ ఏ ఒక్క హామీ కుడా సక్రమంగా అమలు చేయలేదు. ప్రతి మహిళకు 2500 ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది కానీ ఇప్పటికి అమలు కాలేదు. అధికారంలోకి రాగానే వృద్ధాప్య పెన్షన్ 4 వేలు చేస్తాం అన్నారు కానీ కేసీఆర్ ఇచ్చిన 2 వేలు మాత్రమే ఇస్తున్నారు. దివ్యాంగులకు పెంచుతామన్న 6 వేల పెన్షన్, రైతు భరోసా 15 వేలు, రైతులకు రుణమాఫీ 2 లక్షల బోనస్ ప్రతి ఎకరాకు ఇవ్వలేదు. ఉపాధి హామీ కూలీలకు, ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12 వేలు, విద్యార్థులకు 2 లక్షల ఉద్యోగాలు, 23 నెలలుగా ఇవ్వని నిరుద్యోగ భృతి, ఇప్పటి వరకు పెళ్లైన ఆడబిడ్డలకు తులం బంగారం ఇవ్వలేదు. అమలు కానీ హామీలిచ్చి ప్రజల్ని మోసం చేశారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు వెంటనే అమలు చేయాలని, కేసీఆర్ గారి హయాంలో సాగునీరు, 24 గంటల ఉచిత కరెంటు, రైతుబంధు అనేక రైతు సంక్షేమ పథకాలతో వ్యవసాయంలో దేశంలోనే తెలంగాణను అగ్రస్థానంలో నిలిపిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, పంజా రాజు, కాకి అనిల్, తడికల బుల్లెబ్బాయి, గోరింట్ల వెంకటేశ్వరరావు, అంబోజీ సతీష్, గాదంశెట్టి కిషోర్, సృజన్, కుక్కడపు సాయి తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు వీరుల సంస్మరణ దినోత్సవం సందర్బంగా రక్తదానం

- **భారీగా యువకుల తరలింపు**
- **ఎ స్ ఐ కూచిపూడి జగదీష్**

**పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి అక్టోబర్ 31 ( DD9 వార్త )**



పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ పరిధిలోని నేలకొండపల్లి మండలంలోని మార్కెట్ యార్డులో ఏసీబీ తిరుపతిరెడ్డి పోలీసుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పాల్గొని ప్రసంగించారు ప్రజల కోసం ప్రాణాలిచ్చి.. విధి నిర్వహణలో ఆదర్శంగా నిలిచిన పోలీసు అమరవీరులను గుర్తు చేసుకోవడం మన బాధ్యత అని పోలీసు వీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ఈ కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమానికి తిరుమలాయపాలెం నుండి స్థానిక ఎస్సై కూచిపూడి జగదీష్ ఆహ్వానం మేరకు మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి యువకులు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి పొంగులేటి క్యాంపు కార్యాలయం ఇన్చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, వివిధ పార్టీల ప్రముఖులు కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొని రక్తదానం చేశారు




# ఆటో డ్రైవర్లు అందరూ బాధ్యతాయుతంగా మెలగాలి



- **. వెంకటాపురం పోలీస్..**

**అక్టోబర్ 31 డి డి 9 వార్త వెంకటాపు-రం ( నూగురు)**

వెంకటాపురం మండల కేంద్రం యూనియన్ లో గల త్రీ వీల్ ఆటోలు అన్నిటికీ కాఫీడ్ గ్రౌండ్లో వెంకటాపురం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో టాప్ నెంబర్లు నిర్ణయించడం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన స్థానిక సీఐ ముత్యం రమేష్ మాట్లాడుతూ... ఆటో డ్రైవర్లు అందరూ సమాజంలో బాధ్యతాయుతంగా మెలగాలని, తప్పకుండా వాహనాలకు సంబంధించిన అన్ని అనుమతులు, ఇన్సూరెన్స్, డ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలని, పరిమితికి మించి ప్రయాణికులను వాహనంలో ఎక్కించరాదని, వాహనం నడిపేటప్పుడు మద్యం సేవించరాదని, ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని, ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాలని,కొన్ని విలువైన సూచనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకటాపురం ఎస్ఐ కొప్పుల తిరుపతి, సిఆర్పిఎఫ్ డి.ఎస్.పి వెంకటకృష్ణ, మరియు స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# వాజేడు లో ఘనంగా 2కే మారథాన్

**వాజేడు, అక్టోబర్ 31 (డీడీ9 వార్త):**

భారతదేశ ఉక్కు మనిషి, దేశ ఏకీకరణ పితామహుడు సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని, దేశ సమైక్యతను చాటేందుకు వాజేడు పోలీసుల శుక్రవారం "రన్ ఫర్ యూనిటీ" మారథాన్ను ఘనంగా నిర్వహించారు. ఏటా అక్టోబర్ 31న జరుపుకునే ఈ కార్యక్రమం వాజేడు పట్టణంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వాజేడు ఎస్సై సతీష్ మాట్లాడుతూ దేశ ఐక్యతను, సమగ్రతను పెంపొందించడమే ఈ పరుగు ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. పాల్గొన్నవారందరితో దేశ సమైక్యత కోసం అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొని సర్దార్ పటేల్ ఆత్మస్ఫూర్తిని స్మరించారు.



# క్షుద్రపూజల కలకలం. గ్రామస్తుల గుండెల్లో భయం భయం...





**మంగపేట, అక్టోబర్ 31డీడీ 9వార్త**

ములుగు జిల్లా మంగపేట మండలం తిమ్మంపేట గ్రామంలో లంబాడి కాలనీ నుండి అబ్బాయిగూడెం,(కొత్త పేట) చేరు పల్లి గ్రామాలకు వెళ్లే మూడు బాటల మధ్య దారిలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. శుక్రవారం పొద్దుట అటగు వెళ్తున్న గ్రామస్తులు క్షుద్ర పూజల ఆనవాళ్లు కనిపించడంతో ఒక్కసారిగా భయాందోళన చెందరు.గురువారం రాత్రి చేసిఉంటరాని గ్రామస్తులు అనుకుంటున్నారు. ఘటనా స్థలంలో ఎర్ర గుడ్డ, లేడీస్ హ్యాండ్ బ్యాగ్, నిమ్మకాయలు, పసుపు, కుంకుమ మూడు బాటలకాడ రోడ్డుకు మధ్య లో పెట్టారు. అదేచోట చెప్పులు పక్కకు విడిచిచారు. అదే కాకుండా గ్రామంలో రెండు చోట్ల పాత రైస్ మిల్లు ఎదురుగా శ్రీలక్ష్మి ప్రసన్న పర్టీలైజర్ ఎదురుగా పసుపు కల్లర్ నీళ్లతో రోడ్డుపై కట్లు పోచారు. గ్రామస్తులు భయందోలనకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎన్నో పోరాటాల ఫలితం ఈ ప్రాంతంలో మెడికల్ కళాశాల స్థాపన

- **పాత ప్రిన్సిపాల్ నియంతృత్వ ధోరణి వల్లే హోదా మార్పు – మద్దెల దినేష్**
- **ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి కొత్త సూపరింటెండెంట్ ని నియమించాలి**




**పెద్దపల్లి, అక్టోబర్ 31 (డీడీ9 వార్త):**

గోదావరిఖని లోని సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్) నూతన ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నరేందర్ ని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఏఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ గౌస్, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.లెనిన్ పాల్గొన్నారు. నాయకులు ప్రిన్సిపల్ నరేందర్ ని శాలువా కప్పి, పూల గుచ్ఛం అందజేశారు. తరువాత మద్దెల దినేష్ మాట్లాడుతూ... రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజల ఎన్నో పోరాటాల ఫలితంగానే ఈ ప్రాంతంలో మెడికల్ కళాశాల ఏర్పడింది. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వారికి నాణ్యమైన వైద్య విద్య అందించేందుకు కొత్త ప్రిన్సిపల్ కృషి చేయాలి, అన్నారు. అలాగే పాత ప్రిన్సిపల్ నియంతృత్వ ధోరణి వల్లే ప్రజల్లో ఆగ్రహం నెలకొని, అనేక ఫిర్యాదుల అనంతరం ఆయన్ను హోదా నుండి తప్పించారని తెలిపారు. ప్రజా పోరాటాలను చులకనగా తీసుకుంటే ఎంతటి వారైనా కాలమే సమాధానం చెబుతుంది, అని ఆయన వ్యాఖ్యానించారు. తదుపరి మాట్లాడుతూ..

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి కొత్త సూపరింటెండెంట్ నియమిస్తే వైద్యసేవలు మరింత మెరుగుపడతాయి. నూతన ప్రిన్సిపల్ డాక్టర్ నరేందర్ విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని, సిబ్బందితో సమన్వయంతో కళాశాల ప్రతిష్ఠను నిలబెట్టాలని కోరుతున్నాము, అని దినేష్ తెలిపారు.

# శ్రీ కృష్ణ ఫౌండేషన్ నుండి సేవా కార్యక్రమం

**నిజామాబాద్ జిల్లా బోధన్, అక్టోబర్ 31(డిడి9 వార్త):**

శ్రీ కృష్ణ ఫౌండేషన్ తరపున శుక్రవారం ఎడపల్లి మండలం కుర్నాపల్లిలోని పీఎం శ్రీ ఎంపీఎస్ పాఠశాలలో సేవా కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు చేసిన అభ్యర్థన మేరకు, వారు ప్రతిరోజూ ఆహారం తినేందుకు వీలుగా 140 స్టీల్ ప్లేట్లను ఫౌండేషన్ ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు బాలకృష్ణ గారు మాట్లాడుతూ... విద్యార్థుల అవసరాలను తీర్చడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తమతో పాటు పాల్గొని సహకరించిన ప్రసాద్, చిదంబర్, దయాకర్ గారికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. శ్రీ కృష్ణ ఫౌండేషన్ చేసిన ఈ సేవను పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు అభినందించారు




# ఉక్కు మనిషికి ఘన నివాళి







- **ఎడపల్లిలో సర్దార్ పటేల్ 150వ జయంతి రన్**

**నిజామాబాద్ జిల్లా బోధన్, అక్టోబర్ 31(డిడి9 వార్త):**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 565 సంస్థానాలను ఏకం చేసి అఖండ భారతావని నిర్మాణానికి పునాది వేసిన 'ఉక్కు మనిషి', దేశ తొలి ఉప ప్రధాని, హోమ్ శాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని ఎడపల్లిలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఎడపల్లి మండల కేంద్రంలో 3కే యూనిటీ రన్ జరిగింది. బాలికల గురుకుల పాఠశాల నుంచి మంగల్ పహాడ్ చౌరస్తా వరకు ఈ పరుగు కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు బిల్లా రామ్మోహన్, బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు సహా పలువురు వక్తలు మాట్లాడుతూ.. పటేల్ గారి అసామాన్య దార్శనికత, మొక్కవోని ధైర్య సాహసాలు భారత దేశ ఐక్యతకు దోహదపడ్డాయని కొనియాడారు. ప్రత్యేకించి, 1948 లో ఆపరేషన్ పోలో ద్వారా హైదరాబాద్‌ను నిజాం పాలన నుండి విముక్తి చేయడంలో ఆయన పోషించిన కీలక పాత్రను గుర్తు చేశారు. ఈ యూనిటీ రన్‌లో గురుకుల సిబ్బంది, విద్యార్థులు, రాజకీయ నాయకులు, పోలీస్ శాఖ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

# సర్దార్ వల్లభభాయ్ పటేల్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి..

- గిరిజన యువతకు ఫర్నిచర్ తయారీ రంగంలో వృత్తి శిక్షణతో ఉపాధి అవకాశాలు...
- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్...




**భద్రాద్రి కొత్తగూడెం . అక్టోబర్ 31 డి డి 9 ప్రతినిధి.**

ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్‌ను స్ఫూర్తిగా తీసుకొని దేశ సమగ్రత, అభివృద్ధి దిశగా యువత కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో "సర్దార్ @150 ఐక్యత పాదయాత్ర" కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను తెలియజేస్తూ పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని, కేంద్ర యువజన సర్వీసులు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, మై భారత్ సంస్థ సమన్వయంతో దేశవ్యాప్తంగా సర్దార్ @150 ఐక్యత మార్చ్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. దేశ సమగ్రత, ప్రజాస్వామ్య విలువలు, దేశభక్తి భావనలను బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు రూపుదిద్దుకున్నాయని ఆయన తెలిపారు. విద్యార్థులలో ఐక్యతా స్ఫూర్తి పెంపొందించేందుకు వ్యాసరచన, వాదవివాదాలు, సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో పార్లమెంట్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారని కలెక్టర్ వెల్లడించారు. దేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యాన్ని పెంపొందించి, జాతీయ నాయకుల త్యాగాలకు ఘన నివాళి అర్పించడం ప్రధాన ఉద్దేశమని అన్నారు. యువతలో ఐక్యత, దేశభక్తి, సామాజిక బాధ్యతా భావనలను పెంపొందించేందుకు ఈ దేశవ్యాప్త ఐక్యత పాదయాత్రలకు రూపకల్పన చేయబడిందని తెలిపారు. జిల్లా స్థాయిలో నవంబర్ 1 నుండి 15 వరకు మూడు రోజుల పాటు ఐక్యత పాదయాత్రలు, ఆరోగ్య శిబిరాలు, సర్దార్ వల్లభభాయ్ పటేల్ జీవితం పై ప్రసంగాలు, "ఆత్మ నిర్భర్ భారత్" ప్రతిజ్ఞలు, సర్టిఫికేట్ ప్రదానం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ..

## సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఘన నివాళి

**పెద్దపల్లి, అక్టోబర్ 31 (డీడీ9 వార్త):**

సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా సెంటనరీ కాలనీ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి పోరం అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ మాట్లాడుతూ... దేశ ఐక్యతకు పునాది వేసిన 'ఐరన్ మాన్ ఆఫ్ ఇండియా' సర్దార్ పటేల్ సేవలు అపారమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతం నిజాం పరిపాలనలో ఉన్నప్పుడు సింగరేణి బొగ్గు బావులు కూడా ఆ పరిపాలనలో భాగమని గుర్తుచేసి, హైదరాబాద్ సంస్థానాన్ని మిలిటరీ చర్యల ద్వారా భారతదేశంలో విలీనం చేసిన ఘనత అప్పటి హోంమంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ దని అన్నారు. సింగరేణి సంస్థ యాజమాన్యం ఆర్జీ3 ప్రాంతంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం ఆయన చూపిన దూరదృష్టి, క్రమశిక్షణ, నిబద్ధత నేటి యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. దేశప్రజలు పటేల్ గారి ఆలోచనలు, సేవలను స్మరించుకొని అభివృద్ధి, ఐక్యత మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో సెంటనరీ కాలనీ లైన్స్ క్లబ్ అధ్యక్షుడు మేకల మారుతి, మాజీ జడ్పిటిసి గంట వెంకటరమణారెడ్డి, తీగల శ్రీధర్, దంతుల సురేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.




## శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం వైభవం



**నిజామాబాద్, అక్టోబర్ 31(డిడి9 వార్త) :**

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన భీమ్‌గల్ మండలంలోని లింబాద్రి గుట్టపై శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఈ కల్యాణ మహోత్సవాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. విశ్వక్సేన పూజ, కలశ పూజ అనంతరం, శాస్త్రోక్తంగా కన్యాదానం నిర్వహించారు. మంగళ వాయిద్యాల మోత మోగుచుండగా, వివాహ మంగళాష్టకాలు పఠిస్తూ, స్వామివారికి అమ్మవారికి జీలకర్ర బెల్లం సమర్పించారు.

అనంతరం వేదపండితులు భక్తజనుల భక్తి ప్రపత్తుల నడుమ మాంగళ్యధారణ గావించారు. వధూవరులు ఒకరిపై ఒకరు తలంబ్రాలు పోసుకోవడంతో కల్యాణం సంపూర్ణమైంది. స్వామివారి కల్యాణం వీక్షించడానికి వేలది మంది భక్తులు లింబాద్రి గుట్టకు తరలి రావడంతో, గుట్ట మొత్తం భక్తజన సంద్రమైంది. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

**పట్టు వస్త్రాలు సమర్పణ:**

భీమ్‌గల్ సర్వ సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ నరసింహునికి సాంప్రదాయబద్ధంగా పట్టు వస్త్రాలు సమర్పించారు. కమిటీ అధ్యక్షుడు నీలం రవి, ఉపాధ్యక్షుడు బర్ల గంగా మోహన్ సహా పలువురు సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అమ్మకు అక్షరమాల.. ఓరియంటేషన్ శిక్షణ..



**అక్టోబర్ 31 డిడి 9 వార్త వెంకటాపురం (నూగురు).**

న్యూ ఇండియా లిట్రసి ప్రోగ్రాం (ఉల్లాస్) లో భాగంగా నూగురు వెంకటాపురం మండల కేంద్రంలో ఎం.ఈ.ఓ కార్యాలయంలో అమ్మకి అక్షరమాల అనే ఒకరోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉల్లాస్ మరియు టాస్ జిల్లా సమన్వయకర్త పీర్ల కృష్ణ బాబు మాట్లాడుతూ... అమ్మకు అక్షరమాల అనే కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అనివార్య కారణాలవల్ల చదువుకు దూరమైనటువంటి పెద్ద వారిని ,మహిళలను మరుల చదువు వైపు ప్రోత్సహించడం అని ,దీని ద్వారా వయో జనులను వృద్ధిలోకి తెగలడం జరుగుతుందని ఆయన తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జీవీ వి సత్యనారాయణ, ఏపీఎం అప్పారావు పాల్గొనడం జరిగింది.



## పోలీస్ అమరవీరుల స్మరణార్థం జాన్కంపేట్‌లో కొవ్వొత్తుల ర్యాలీ

**నిజామాబాద్ జిల్లా బోధన్, అక్టోబర్ 31(డిడి9 వార్త):**

పోలీస్ అమరవీరుల ఆత్మ శాంతి కలగాలని కోరుతూ ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఘనంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దేశ రక్షణలో తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరుల సేవలను స్మరించుకుంటూ, గాంధీచౌక్ దగ్గర నుండి ఈ ర్యాలీ ప్రారంభమైంది. ఇన్చార్జి ఎస్సై రాజు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. అమరవీరుల త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పు సురేష్, సాకలి కిషోర్, అంజద్ మజీద్, గ్రామస్తులందరూ పాల్గొన్నారు.



# రన్ ఫర్ యూనిటీ'తో ఐక్యత చాటిన వెంకటాపురం పోలీస్




- **సర్దార్ పటేల్ స్ఫూర్తితో దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపు!**

**వెంకటాపురం నూగురు అక్టోబర్ 31 డి డి9 వార్త**

భారతదేశ ఐక్యతకు పతిరూపంగా నిలిచిన స్వాతంత్ర్య సమరయోధుడు, ఉక్కు మనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా, 'జాతీయ ఐక్యత దినోత్సవం'ను పురస్కరించుకుని వెంకటాపురంలో 'రన్ ఫర్ యూనిటీ - 2కే రన్' కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. వెంకటాపురం పోలీస్ శాఖ ఈ పరుగును ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. వెంకటాపురం శివాలయం వద్ద ఉదయం ఈ ఐక్యతా పరుగు ఉత్సాహంగా ప్రారంభమైంది. ప్రధాన రహదారి మీదుగా నూగురూ వరకు సాగిన ఈ 2 కిలో మీటర్ల పరుగులో స్థానిక యువత, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ ముత్యం రమేష్ మరియు సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ వెంకట కృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ... "సర్దార్ వల్లభాయ్ పటేల్ భారత ఐక్యతకు ప్రతీక. ఆయన అందించిన స్ఫూర్తితో యువతరం దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలి. దేశ సమగ్రతను, ఐక్యతను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని పిలుపునిచ్చారు. ఈ 'రన్ ఫర్ యూనిటీ' కార్యక్రమంలో ఎస్.ఐ. తిరుపతి, సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో పాటు వెంకటాపురం యువకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

# మాజీ మంత్రి హరీష్‌రావు కుటుంబాన్ని పరామర్శించిన వ్యాల్ల హరీష్‌రెడ్డి



**పెద్దపల్లి, అక్టోబర్ 31 (డీడీ9 వార్త):**

మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణరావు ఇటీవలే మృతి చెందిన నేపథ్యంలో, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వ్యాల్ల హరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో రామగుండం బీఆర్ఎస్ నాయకులు హైదరాబాదులోని వారి నివాసాన్ని శుక్రవారం సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు స్వర్గీయ సత్యనారాయణరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించడంతో పాటు, కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి జాహిద్ పాషా, మాజీ కార్పొరేటర్లు ఎన్.వి. రమణారెడ్డి, రవి నాయక్, యువజన విభాగ అధికార ప్రతినిధి బూరుగు వంశీకృష్ణ, సీనియర్ నాయకులు మెరుగు చంద్రమౌగిలి, మడిశెట్టి రవి, మాజీ కౌన్సిలర్ కృష్ణస్వామి, రామస్వామి, బోట్ల పోషం, అల్లి గణేష్, నడిపల్లి సాయి, మైనార్టీ నాయకులు అతహరుద్దీన్, ఎరగొళ్ళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల రక్షణ కోసం ఏఐటీయూసీ పిలుపు

- **4 లేబర్ కోడ్స్ రద్దు చేసేవరకు పోరాటం కొనసాగిస్తాం – ఏఐటీయూసీ రామగుండం నాయకులు**

**పెద్దపల్లి, అక్టోబర్ 31 (డీడీ9 వార్త):**




ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) రామగుండం నగర సమితి ఆధ్వర్యంలో గోదావరిఖని ఆర్టీసీ డిపో వద్ద ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర కమిటీ ప్రధాన కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు అబ్దుల్ కరీం, ప్రధాన కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్ మాట్లాడుతూ, బ్రిటీష్ పాలనలోనే కార్మిక హక్కుల కోసం పోరాడిన ఏఐటీయూసీ గత 100 ఏళ్లలో 44 కార్మిక చట్టాలను సాధించిందని తెలిపారు. కానీ నేటి కేంద్రంలోని బిజెపి మోడి ప్రభుత్వం 29 చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్స్ రూపంలో కార్మికుల హక్కులను హరించిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్స్ వ్యాపారం సులభతరం పేరుతో పెద్ద కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే విధంగా ఉన్నాయని, కార్మిక వర్గానికి ద్రోహంగా ఉన్నాయని పేర్కొన్నారు. అవి రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. అలాగే కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలన్న డిమాండ్ ను పునరుద్ఘాటించారు. బ్రిటీష్ కాలంలో 1920 అక్టోబర్ 31న బొంబాయిలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు లాలా లజపతిరాయ్ అధ్యక్షతన ఏఐటీయూసీ స్థాపించబడిందని, స్వాతంత్ర్య సమరంలో మరియు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిందని వారు గుర్తు చేశారు. ఏఐటీయూసీ "సంపూర్ణ స్వాతంత్ర్యం" అనే నినాదాన్ని మొదటగా లేవనెత్తిన సంస్థగా చరిత్రలో నిలిచిందని తెలిపారు. నేటి పరిస్థితుల్లో కార్మిక హక్కుల అమలులో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, న్యాయస్థానాల్లో కూడా న్యాయం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇప్పుడు "శ్రమ్ శక్తి ఎన్ఐటీఐ 2026" పేరుతో కొత్త జాతీయ కార్మిక విధానాన్ని తీసుకురావడం ద్వారా కార్మిక వర్గాన్ని బ్రిటీష్ కాలం నాటి పరిస్థితికి నెట్టేస్తోందని తీవ్రంగా విమర్శించారు. ఏఐటీయూసీ 106వ జయంతోత్సవాలను వారం రోజులపాటు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బిక్షపతి, మసూద్, దరిపెల్లి శ్రీనివాస్, మామిడిపల్లి శ్రీనివాస్, కార్మికులు శనిగరపు మతీనా, మర్సలీన్ శేఖర్, శంకర్, శనిగరపు తిరుమల, ఉషాకోయిలా రసజ్ఞ, బి. అనిల్ కుమార్, కాసిపేట రాజేశ్వరి, రామగిరి లక్ష్మి, ఠాకూర్ కళావతి, పుల్యాల రాధా, బొందెల సంగీత, పొడిశెట్టి సుగుణ, వసంత, పురుషోత్తం పావురం తదితరులు పాల్గొన్నారు

# ఆకెనపల్లి గ్రామంలో బొడ్రాయి విగ్రహ భూమి పూజ ఘనంగా



- **విగ్రహ దాతలు గాదె స్రవంతి– సుధాకర్ దంపతులు**

**పెద్దపల్లి, అక్టోబర్ 31 (డీడీ9 వార్త):**

రామగుండం నియోజకవర్గం అంతర్గాం మండలం, ఆకెనపల్లి గ్రామంలో బొడ్రాయి విగ్రహ ఏర్పాటు కోసం ఈరోజు భూమి పూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ సంప్రదాయాలకు, దేవాలయాల ప్రతిష్ఠకు ప్రాధాన్యం ఇస్తూ గ్రామ ప్రజల సహకారంతో ఈ కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమంలో బొడ్రాయి విగ్రహ దాతలు శ్రీమతి గాదె మాధవి (స్రవంతి) –సుధాకర్ దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామ దేవత సేవలో భాగంగా బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన బాధ్యతను స్వీకరించడం మా కుటుంబానికి గౌరవం. గ్రామ సంప్రదాయాలను, భక్తి విశ్వాసాలను నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరుకుంటున్నాము, అన్నారు. గ్రామ ప్రజల ఐక్యతతో ఈ పవిత్ర ఉత్సవాలు విజయవంతంగా జరగాలని, దేవత ఆశీర్వాదాలతో గ్రామం అభివృద్ధి మార్గంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

**బొడ్రాయి – పోచమ్మ ఉత్సవాల తేదీలు నిర్ణయం**

నవంబర్ 8 (శనివారం): పూజా కార్యక్రమాలు ప్రారంభం

నవంబర్ 9 (ఆదివారం): కుంకుమ పూజ, ఆడుబిడ్డలతో నీళ్లు పోసే కార్యక్రమం

నవంబర్ 10 (సోమవారం): బొడ్రాయి ప్రాణ ప్రతిష్ఠ మరియు అన్న ప్రసాదం

పోచమ్మ బోనాలు మరియు కొలుపు

నవంబర్ 12 (బుధవారం): ఉదయం 9.00 గంటలకు పోచమ్మ బోనాలు,

సాయంత్రం 6.00 గంటలకు పోచమ్మ కొలుపు ప్రారంభం

నవంబర్ 13 (గురువారం): గ్రామం చుట్టూ సరువు తిరుగుడు, చెట్ల తీర్థాలు

గ్రామ ప్రజల సహకారంతో ఈ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని బొడ్రాయి విగ్రహ దాతలు గాదె స్రవంతి–సుధాకర్ తెలిపారు.



# మెగా (విజయం)రక్తదాన శిబిరం

- **మెగా రక్తదాన శిబిరం కు ' విశేష స్పందన '**
- **పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా మెగా రక్తదాన శిబిరం**
- **మెగా రక్తదాన శిబిరం లో 106 మంది రక్తదానం.**
- **దివ్యాంగులు సైతం రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు.**
- **అమ్మ జన్మనిస్తే -- ప్రాణాపాయ స్థితిలో పునర్జన్మను ప్రసాదించేది రక్తదానం - ఎమ్మెల్యే డాక్టర్ తెల్ల వెంకట్రావు**
- **అమరవీరులకు మనమిచ్చే నిజమైన నివాళి ఈ రక్తదానం - ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్**
- **రక్తదానం అనేది ప్రతి ఒక్కరికీ జీవితంలో నిరంతర ప్రక్రియ -- జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివ నాయక్ .**

**భద్రాచలం అక్టోబర్ 31 డిడి 9 వార్త**







పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు భద్రాచలం డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణంలోని అన్నపూర్ణ ఫంక్షన్ హాల్ నందు ' మెగా రక్తదాన శిబిరం ' ఏర్పాటు చేయడం జరిగినది. ముందుగా ఈ రక్తదాన శిబిరంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివ నాయక్, పట్టణ సిఐ యం నాగరాజు, పట్టణ ఎస్ఐ లు సంతోష్, శ్యామ్, చర్ల సిఐ రాజు వర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి,దుమ్ముగూడెం ఎస్ఐ గణేష్ పోలీస్ సిబ్బంది రక్తదానం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ మెగా రక్తదాన శిబిరంకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ అమ్మ జన్మనిస్తే, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి పునర్జన్మను ఒక రక్త దానం తోనే ప్రసాదించవచ్చు అని అన్నారు. రక్తదానం చేయడం వలన శరీరంలోని పాత రక్తం పోయి కొత్త రక్తం చేరడంతో తో యువత మరింత ఆరోగ్యంగా ఉత్సాహంగా ఉంటారని అన్నారు . అలాగే ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరులకు మనమిచ్చే నిజమైన నివాళి ఈ రక్తదానం అని అన్నారు. ఈ రక్తదాన శిబిరానికి విచ్చేసి రక్తదానం చేసిన రక్తదాతలకు పోలీసు శాఖ తరుపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. మీరు ఇచ్చే రక్తం మరొకరికి ప్రాణం దానం అని అన్నారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివ నాయక్ మాట్లాడుతూ రక్త దానం అనేది ప్రతి మనిషి జీవితం లో నిరంతర ప్రక్రియని అని, రక్తదానం అనేది ప్రాణాపాయ స్థితిలో ఉన్న సాటి మనిషికి ఆయుష్షు పెంచే ఆయుధం అని అన్నారు. అలాగే ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా భద్రాచలం లో ఈ మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ప్రాణపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం అనేది ఒక ఆక్సిజన్ లా ప్రాణం నిలబడడానికి దోహదపడుతుందని అన్నారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏరియా హాస్పిటల్ సూపర్డెంట్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన రక్తంలోని కొలెస్ట్రాల్ శాతం తగ్గి గుండె సంబంధిత వ్యాధుల నుండి దూరం చేస్తుందని అన్నారు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా భద్రాచలం ఏరియా హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ కు 106 యూనిట్లు రక్తాన్ని ఇచ్చారని తెలిపారు. మీరు ఇచ్చిన రక్తం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే ఎంతో గర్భిణులకు, తలసేమియా సికెల్ సెల్ అనీమియా బాధపడుతున్న చిన్నారులకు , అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి ఉపయోగపడుతుందని తెలిపారు. పోలీస్ పిలుపు మేరకు భద్రాచలం పట్టణంలోని దివ్యాంగులు సైతం స్వచ్ఛందంగా ముందుకు రావడం యువతకు ఆదర్శంగా నిలిచారని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ దివ్యాంగులను అభినందించారు. పట్టణ సిఐ మాట్లాడుతూ భద్రాచలం డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరం కు విశేష స్పందన లభించిందని అన్నారు.ఈ రక్తదాన శిబిరం లో పట్టణంలోని ఆటో యూనియన్ డ్రైవర్స్, యువత , పోలీస్ సిబ్బంది , సిఆర్పిఎఫ్ సిబ్బంది, దివ్యాంగులు, న్యాయవాదులు, చర్ల, దుమ్ముగూడెం పోలీస్ సిబ్బంది, యువత, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదాన చేశారని తెలిపారు.ఈ రక్తదాన శిబిరం లో మొత్తం 106 మంది రక్తదానం చేశారని తెలిపారు. ఈ 106 యూనిట్ల రక్తాన్ని భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాల బ్లడ్ బ్యాంక్ కు అందజేశామని తెలిపారు. అడగగానే ముందుకు వచ్చి రక్తదానం చేసిన రక్తదాతలు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రక్తదానం చేసిన రక్తదాతలకు డోనార్ సర్టిఫికెట్స్, పండ్లు , ఫ్రూటి, ఎగ్స్, జ్యూస్ లను అందజేశారు . ఈ కార్యక్రమంలో లో భద్రాచలం పట్టణ సిఐ యం నాగరాజు, పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతి రావు, పట్టణ ఎస్ఐ లు సతీష్, శ్యామ్, చర్ల సిఐ రాజు వర్మ , ఎస్ఐ నర్సిరెడ్డి, దుమ్ముగూడెం ఎస్ఐ గణేష్, సి ఆర్ పి ఎఫ్ 141 బెటాలియన్ అధికారులు, పోలీస్ సిబ్బంది,యువత, విద్యార్థులు, ఆటోడ్రైవర్స్, న్యాయవాదులు , బ్లడ్ ఆర్గనైజర్స్, తగ్గితరులు పాల్గొన్నారు.















# అన్నదాతను ఆగం చేసిన మోంథా తుఫాన్!

- **రైతులను పరామర్శించిన బిజెపి రామగుండం ఇన్‌ఛార్జ్ కందుల సంధ్యారాణి**
- **ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలంటూ కలెక్టర్‌కి వినతి పత్రం**

**పెద్దపల్లి, అక్టోబర్ 31 (డీడీ9 వార్త):**



మోంథా తుఫాన్ ప్రభావంతో రామగుండం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పంటలు నేలకొరిగి రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూశారు. ఈ నేపథ్యంలో రైతులను పరామర్శించి వారి పరిస్థితిని తెలుసుకునేందుకు రామగుండం బిజెపి ఇన్‌ఛార్జ్ కందుల సంధ్యారాణి శుక్రవారం పంట పొలాలను పరిశీలించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంట చేతికి వచ్చిన వేళ అకాల వర్షాలు రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి వచ్చే పంట దిగుబడి మేరకు కనీస మద్దతు ధర చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన అమలు చేయకపోవడం వలన రైతులు భీమా సదుపాయానికి నోచుకోలేకపోతున్నారని ఆమె విమర్శించారు. రైతులను ఆదుకునేందుకు ఈ పథకాన్ని తక్షణమే అమలు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రామగుండం బిజెపి ఇన్‌ఛార్జ్ కందుల సంధ్యారాణి పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకి వినతి పత్రాన్ని అందజేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్వి లేజీ రామగుండం రైతుల కోసం కలెక్టర్‌కి వినతి పత్రం సమర్పణ రామగుండం మండలం విలేజీ రామగుండం గ్రామంలో రైతుల సౌకర్యార్థం ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కందుల సంధ్యారాణి కలెక్టర్‌కి మరో వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...

ఈ ప్రాంతంలో సుమారు 800 ఎకరాల వ్యవసాయ భూములు ఉండగా, రామగుండం, హౌసింగ్ బోర్డు కాలనీ, పాములపేట రైతులకు ఈ కేంద్రం ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. గతంలో పలు మార్లు డిమాండ్ చేసినప్పటికీ ఇప్పటివరకు కేంద్రం ఏర్పాటు కాలేదని చెప్పారు.

ప్రస్తుతం సింగరేణి యాజమాన్య స్థలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం సాధ్యమని తెలిపారు. ఈ ప్రతిపాదనపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాల్లో బిజెపి అంతర్గాం మండల అధ్యక్షులు బోడకుంటి సుభాష్, వేల్పుకొండ సంపత్, గొల్లూరి పురుషోత్తం, ఆలకుంట మల్లేష్, తీగుట్ల నవీన్, ఉప్పుల నీలయ్య, తోట మహేష్, మల్లెత్తుల శంకర్, సంతపురి మహేష్, జెట్పట్ తిరుపతి, పోరండ్ల నాగరాజు, శశి, మంత్రి సురేష్ తదితరులు పాల్గొన్నారు.





# సర్దార్ పటేల్ జయంతి సందర్భంగా బసంత్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో 2కె రన్

- **యువతలో దేశభక్తి, శారీరక దృఢతకు ప్రేరణ**

**పెద్దపల్లి, అక్టోబర్ 31 (డీడీ9 వార్త):**

ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా బసంత్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో “రన్ ఫర్ యూనిటీ - 2కె రన్” కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బసంత్‌నగర్ ఎస్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో ధర్మారం క్రాస్ రోడ్ నుండి కురుమపల్లి ఎయిర్‌పోర్ట్ వరకు రెండు కిలోమీటర్ల పరుగు జరిగింది. ఈ కార్యక్రమంలో పాలకుర్తి మండలం పరిధిలోని కన్నాల, బసంత్‌నగర్, జీడి నగర్, రాజీవ్ తండా, పుట్నూరు గ్రామాలకు చెందిన యువకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి పాలకుర్తి మాజీ ఎంపీపీ గంగాధర్ రమేష్, కన్నాల మాజీ ఎంపీటీసీ దేవి లక్ష్మీ నరసయ్య, బామ్లా నాయక్ తండా సర్పంచ్ రాజు నాయక్, యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రావణ్, వెంకటేష్, అంజి నాయక్, సమ్మయ్య, రాజు, రాజేశం, దేవి రోహిత్, దేవి రితిక్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీధర్ మాట్లాడుతూ... “సర్దార్ వల్లభభాయ్ పటేల్ స్ఫూర్తితో యువత దేశభక్తి, క్రమశిక్షణతో జీవించాలి. శారీరకంగా దృఢంగా, మానసికంగా ఉత్సాహంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో రన్నింగ్, వాకింగ్ అలవాటు చేసుకోవాలి. చెడు అలవాట్లకు దూరంగా ఉండి సమాజానికి ఆదర్శంగా నిలవాలి” అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐతో పాటు పోలీస్ కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.



# నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు నిలిపివేయాలి

- **డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి**

**పెద్దపల్లి, అక్టోబర్ 31 (డీడీ9 వార్త):**

రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి టోకు వ్యాపారులను ఉద్దేశించి మాట్లాడుతూ, నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సామాగ్రి విక్రయాలు జరపకూడదని విజ్ఞప్తి చేశారు. అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) మరియు కమిషనర్ జె. అరుణ శ్రీ ఆదేశాల మేరకు, శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో కళ్యాణ్ నగర్ టోకు వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ... “ప్లాస్టిక్ వినియోగం వలన పర్యావరణానికి, మన ఆరోగ్యానికి తీవ్ర అనర్థాలు కలుగుతున్నాయి. ప్రభుత్వం విధించిన నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి వ్యాపారులు సహకరించాలి,” అన్నారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టి, నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలపై భారీ జరిమానాలు విధించనున్నట్లు తెలిపారు. ఇతర ప్రాంతాల నుండి రవాణా అవుతున్న నిషేధిత ప్లాస్టిక్ సామాగ్రిపై సమాచారం అందించమని వ్యాపారులను కోరారు. టోకు వ్యాపారులు తమకు మూడు రోజుల గడువు ఇవ్వాలని కోరుతూ, ఆ తరువాత నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు నిలిపివేస్తామని స్వచ్ఛంద హామీ పత్రాలు సమర్పించారు. డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, ప్లాస్టిక్‌కు బదులుగా వస్త్రం, జనప నార, కాగితం వంటి భూమిలో త్వరగా కలిసిపోయే ప్రత్యామ్నాయ వస్తువులు వాడేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ మేరకు మెప్మా సిబ్బందికి స్వశక్తి మహిళా సంఘాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు.

సమావేశంలో నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మెప్మా టీఎంసీ మౌనిక, సానిటరీ ఇన్స్పెక్టర్లు నాగభూషణం, సంపత్, సీనియర్ అసిస్టెంట్లు కల్ రామ్, శ్రీపాల్ తదితరులు పాల్గొన్నారు.

నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 53వ డివిజన్ కళ్యాణ్ నగర్‌లో తడి చెత్త, పొడి చెత్త వేరు చేయాలన్న అవగాహన కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎకో వారియర్స్ ప్రతినిధులు కరుణాకర్, మహేందర్, సానిటరీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.





# దేశంలో కార్మిక వర్గ హక్కుల సాధనలో ఏఐటియూసీ ది ఎనలేని కృషి





- **ఏఐటియూసీ 106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జెండా ఆవిష్కరణ చేసిన ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్**
- **కార్మికుల ఎజెండానే ఏఐటియూసీ జండా – ఏఐటియూసీ నాయకులు**

**పెద్దపల్లి, అక్టోబర్ 31 (డీడీ9 వార్త):**

దేశంలో కార్మిక వర్గ హక్కుల సాధనలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటియూసీ) ఎనలేని పాత్ర పోషించిందని నాయకులు పేర్కొన్నారు. గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో శుక్రవారం జరిగిన ఏఐటియూసీ 106వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బొంబాయి నగరంలో 1920 అక్టోబర్ 31న లాలా లజపతిరాయ్ అధ్యక్షతన ఏర్పడిన ఏఐటియూసీ, ఆ రోజునుంచి నేటివరకు కార్మిక వర్గ హక్కుల కోసం, దేశ స్వాతంత్ర్యం కోసం అనేక ఉద్యమాలు నిర్వహించింది. ఆధునిక భారతదేశ నిర్మాణంలో ఏఐటియూసీ పోషించిన పాత్ర విశేషం," అన్నారు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు, ఏఐటియూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ. గౌస్.

**వారు మాట్లాడుతూ...**

ఏఐటియూసీ చరిత్ర త్యాగాలు, బలిదానాలు, పోలీస్ దాడులు, పెట్టుబడిదారుల దౌర్జన్యాలు, మరణశిక్షలు, జీవిత ఖైదులతో నిండిన ఎర్ర చరిత్ర అని పేర్కొన్నారు. కోట్లాది మంది కార్మిక వర్గానికి గొంతుకగా నిలిచిన ఏఐటియూసీ చారిత్రక ప్రాముఖ్యతను వివరించారు. గత 105 సంవత్సరాలుగా కార్మిక వర్గం చేసిన పోరాటాల ఫలితంగానే నేటి హక్కులు సాధ్యమయ్యాయని, కానీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 కొత్త 'కార్మిక కోడ్స్'ను తీసుకువచ్చిందని విమర్శించారు. వాటిని ఎదుర్కోవాలంటే కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలంటూ పిలుపునిచ్చారు. సింగరేణి కార్మికులు అనుభవిస్తున్న ప్రతి హక్కు, ఏఐటియూసీ చేసిన చారిత్రక పోరాటాల ఫలితం అని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఏఐటియూసీ ఆర్జీ 1 బ్రాంచ్ కార్యదర్శి ఆరెల్లి పోషం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్, సిపిఐ నగర సహాయ కార్యదర్శి తాళ్లపెల్లి మల్లయ్య, నాయిని శంకర్, లెనిన్, నవీన్, పొన్నం రంజిత్, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేష్ కుమార్, ఏఐటియూసీ ఆర్జీ 1 బ్రాంచ్ ఆఫీస్ బేరర్స్, పిట్ కార్యదర్శులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ పొందిన క్రీడాకారుడు కిరణ్ క్రిస్టోఫర్‌కు ఘన సన్మానం



- **సింగరేణి క్రీడాకారుల ఆధ్వర్యంలో ఆర్జీ–2 వర్క్‌షాప్‌లో వేడుక**

**పెద్దపల్లి, అక్టోబర్ 31 (డీడీ9 వార్త):**

సింగరేణి ఆర్జీ-2 ఏరియా వర్క్‌షాప్‌లో జనరల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ, శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన కోల్ ఇండియా స్థాయి క్రికెట్, ఫుట్‌బాల్ క్రీడాకారుడు జూపాక కిరణ్ క్రిస్టోఫర్‌కు సహోద్యోగులు ఘన సన్మానం చేశారు.

ఈ సందర్భంగా ఆర్జీ-2 వర్క్‌షాప్‌లో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి వివిధ ఏరియాలకు చెందిన సింగరేణి క్రీడాకారులు హాజరయ్యారు. కిరణ్ క్రిస్టోఫర్-నళిని దంపతులను పూలమాలలు, శాలువాలతో అలంకరించి, జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో మాట్లాడిన పలువురు కిరణ్ క్రిస్టోఫర్ ఒక నిబద్ధత కలిగిన ఉద్యోగి, ప్రతిభావంతుడైన క్రీడాకారుడు అని, పలు స్థాయి పోటీల్లో పాల్గొని సింగరేణి సంస్థకు విశిష్ట గౌరవం తీసుకువచ్చారని అభినందించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు ముకేష్ కుమార్, అసిఫ్ యాసిన్, కె.ఎల్.ఎన్. ప్రసాద్, కుశనపల్లి శంకర్, ఆరె శ్రీనివాస్, బుర్ర దేవేందర్ గౌడ్, అల్లం రమేష్, పాముల శేషగిరి, గంధం శ్రీనివాస్, దగ్గుల శ్రీనివాస్, నరసింహారెడ్డి, చంద్రపాల్, తాండూరి సత్యనారాయణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి

- **పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**
- **సమైక్యతా భావం పట్ల అవగాహన కల్పించడమే లక్ష్యం**

**పెద్దపల్లి, అక్టోబర్ 31 (డీడీ9 వార్త):**

దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ప్రజలందరూ ఐక్యతతో, బంధుభావంతో ముందుకు సాగాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. భారత ఐక్యతకు ప్రతీక అయిన సర్దార్ వల్లభభాయి పటేల్ 150వ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యత దినోత్సవం - "రన్ ఫర్ యూనిటీ" కార్యక్రమం శుక్రవారం గోదావరిఖనిలో ఘనంగా జరిగింది. 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనా రెడ్డి, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయగా, అనంతరం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా జెండా ఊపి పరుగు ప్రారంభించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయం నుంచి రామగుండం మున్సిపల్ టిజంక్షన్ వరకు, తిరిగి కమిషనరేట్ గ్రౌండ్ వరకు పరుగు సాగింది.

ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ... సర్దార్ పటేల్ దేశాన్ని ఏకతా బంధంతో కట్టిపడేసిన మహానాయకుడు. ఆయన సేవలు ప్రతి భారతీయుడికి ప్రేరణ. మనమందరం ఐక్యతతో, స్ఫూర్తితో ముందుకు సాగితేనే దేశ అభివృద్ధి మరింత వేగంగా సాధ్యమవుతుంది అన్నారు.

**సినీ నటుడు సాగర్ మాట్లాడుతూ,**

రజాకార్లను విచ్ఛిన్నం చేసి తెలంగాణ ప్రజలను ఏకం చేసిన సర్దార్ పటేల్ కృషిని మనం ఎప్పటికీ మరవలేము. ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు ఐక్యతతో ముందుకు రావాలి అని తెలిపారు.

యువత, ప్రభుత్వ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమం ద్వారా దేశభక్తి, సమైక్యతా భావం ప్రతి ఒక్కరికీ చేరేలా తమ వంతు సహకారం అందించాలని సీపీ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు.



కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) శ్రీనివాస్, ఏసీపీ మడత రమేష్ (గోదావరిఖని), ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఇన్స్పెక్టర్ రాజేశ్వర్ రావు (ట్రాఫిక్), ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, వామన మూర్తి, శేఖర్, మల్లేశం, సంపత్, సినీ నటుడు సాగర్, అలాగే పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# ఎస్.ఐ.ఆర్ సన్నాహక ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి ..




- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్...

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి అక్టోబర్ 31 (డి డి 9).**

జిల్లాలో ప్రత్యేక ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) సన్నాహక ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్దిష్ట గడువులోపు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ శ్రీ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా అసిస్టెంట్ ఎలక్షన్ రిజిస్టరింగ్ ఆఫీసర్లు (AEROs), బూత్ లెవల్ ఆఫీసర్లు (BLOs) మరియు బిఎల్ఓ సూపర్వైజర్లతో ఎస్.ఐ.ఆర్ పూర్వ సన్నాహక ప్రక్రియ పురోగతిని




సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్.ఐ.ఆర్ సన్నాహక ప్రక్రియను పారదర్శకంగా, తప్పిదాలకు తావు లేకుండా నిర్వహించాలని, నిర్దిష్ట రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో బిఎల్ఓలు బాధ్యతాయుతంగా పని చేసి, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో తప్పకుండా ఉండేలా నిశిత పరిశీలన జరపాలని సూచించారు. 2002 సంవత్సరపు ఓటరు జాబితాను 2025 సంవత్సరం జాబితాతో మ్యాపింగ్ చేసి నాలుగు కేటగిరీలుగా విభజించినట్లు గుర్తు చేశారు. ముందుగా మ్యాపింగ్ చేయబడిన కేటగిరి 'ఏ' జాబితాను బిఎల్ఓ యాప్ ద్వారా ధృవీకరించి, అది ఎన్నికల సంఘం పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం కేటగిరీ 'సి' మరియు కేటగిరీ 'డి' లోని ఓటర్లను 'ఏ' కేటగిరీకి మ్యాపింగ్ చేసే ప్రక్రియను ఎఇఆర్ఓల ఆధ్వర్యంలో బిఎల్ఓ సూపర్వైజర్లు, బిఎల్ఓలు బిఎల్ఓ యాప్ ద్వారా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా, ప్రజా పాలన రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన సాదా బైనామా మరియు అసైన్డ్ భూముల పెండింగ్ దరఖాస్తులను నవంబర్ 3వ తేదీ లోపు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజు పరిష్కరించిన దరఖాస్తులపై వివరాలను నివేదిక రూపంలో సమర్పించాలనీ, తిరస్కరించిన దరఖాస్తులపై తగిన కారణాలను స్పష్టంగా నమోదు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు...

# ఎకరాకు 50 వేల నష్టపరిహారం అందించాలి

- జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత..

**హుజురాబాద్,(డీడీ9,వార్త):**



కల్వల ప్రాజెక్టును వెంటనే మరమ్మత్తు చేయాలి, కరీంనగర్ ఎంపీ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, హుజరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి లు స్పందించి కల్వల ప్రాజెక్టు మరమ్మత్తు పనులు వెంటనే ప్రారంభించాలని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కోరారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా, శంకరపట్నం మండలంలోని, కాచాపూర్ గ్రామం శివారులో మేచినేని శ్రీనివాసరావు వరి పంట మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు నేల వాడడంతో పరిశీలించి, కల్వల ప్రాజెక్ట్ గండిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... కల్వల ప్రాజెక్టు 2 సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టు కు గండిపడి ప్రాజెక్టులో నీటి నిల్వ లేక వీణవంక మండలంలోని 10 గ్రామాల రైతులు సాగునీరందక పంటలు ఎలా పండించాలో వేసిన పంటలు ఎలా కాపాడుకోవాలని ఆందోళన చెందుతున్నారని, గద్దపాక కల్వల మత్స్య సహకార సంఘం కు చెందిన 80 కుటుంబాలు కల్వల ప్రాజెక్టు గండి పడడంతో జీవనోపాధి కరువైందని, కల్వల ప్రాజెక్టు మరమత్తు కోసం గతంలో 70 కోట్ల నిధులతో మంజూరు చేయుటకు ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేసిందని, వెంటనే కల్వల ప్రాజెక్టు మరమత్తు కోసం నిధులు విడుదల చేయించేందుకు కేంద్ర సహాయ మంత్రి, ఎమ్మెల్యేలు స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కలువల ప్రాజెక్టు ఎమ్మెల్యేలుమరమ్మత్తు చేయించేందుకు కృషి చేయాలని, మొంథా తుఫానుకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేల రూపాయలు ప్రభుత్వం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్, మండల అధ్యక్షురాలు సల్మా, కాచాపూర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ కొండ్ర రాజయ్య, జాగృతి నాయకులు, రైతులు ,మహిళల తోపాటు తదితరులు పాల్గొన్నారు

# ఎన్.సి.సి విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన




**నిజామాబాద్ జిల్లా బోధన్, అక్టోబర్ 31(డిడి9 వార్త) :**

ఎడపల్లి మండలం జానకంపేట శివారు ప్రాంతంలోని కమిషనరేట్ ట్రైనింగ్ సెంటర్‌లో శుక్రవారం నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఎన్.సి.సి విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులపై నడుస్తున్నప్పుడు, వాహనాలు నడుపుతున్నప్పుడు మరియు ప్రయాణిస్తున్నప్పుడు పాటించాల్సిన ట్రాఫిక్ నియమాలు, జాగ్రత్తలు, భద్రతా చర్యలు గురించి వివరించారు. ప్రజల ప్రాణ భద్రత కోసమే ట్రాఫిక్ నియమాలు రూపొందించబడినందున ప్రతి ఒక్కరూ అవి కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

మహిళా విద్యార్థులకు ప్రత్యేకంగా 'షీ టీమ్' పనితీరుపై అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్, వేధింపులు, ప్రజా ప్రదేశాల్లో మహిళలను హింసించే ఘటనలను అరికట్టడం లక్ష్యంగా షీ టీమ్స్ పనిచేస్తున్నాయని ఆయన వివరించారు.

బస్‌స్టాప్‌లు, కళాశాలలు, మార్కెట్లు, పార్కులు వంటి ప్రదేశాల్లో మహిళలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళలు ఎప్పుడైనా ప్రమాదం లేదా వేధింపుల సమయంలో 100 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఆశన్న, క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ప్రియజిత్ సూర్, అడమ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ విష్ణు ప్రసాద్ నాయర్ పాల్గొన్నారు.

# 'మొంథా' తుఫాన్ నష్టాన్ని అంచనా వేస్తున్నాం

**హుజురాబాద్ (డీడీ9 వార్త):**

హుజురాబాద్: మండల పరిధిలోని జూపాక గ్రామంలో ఇటీవల 'మొంథా' తుఫాను వల్ల దెబ్బతిన్న రోడ్లు, పంట పొలాలను హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్ కాంగ్రెస్ నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జూపాకహుజురాబాద్ రోడ్డును కూడా పరిశీలించామని తెలిపారు. తుఫాను కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నామని, ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి అందజేశామని తెలిపారు. రైతులెవరూ అధైర్యపడవద్దని, రైతు ప్రభుత్వంగా అన్నదాతలను ఆదుకుంటామని ప్రణవ్ భరోసా ఇచ్చారు. దెబ్బతిన్న రోడ్లకు త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని, తుఫాన్ నష్టం వివరాలను ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి బాధితులను ఆదుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం పలువురు రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సకాలంలో తీసుకునేలా ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని, ప్రభుత్వం రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని ప్రణవ్ హామీ ఇచ్చారు.

